# ముక్కోటి ఉత్సవాలకు వేళాయె..

- ఈ నెల 22న తెప్పోత్సవం
- 23న ఉత్తర ద్వార దర్శనం
- జనవరి 8న విశ్వరూప సేవ


నారసింహావతారం


వామనావతారం

భద్రాచలం, డిసెంబర్ 3: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు వేళైంది. ఈ నెల 13 నుంచి జనవరి 2 వరకు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మధుకైటభులు అనే రాక్షసులను శ్రీమన్నారాయణుడు సంహరించి, ఈ వైకుంఠ ఏకాదశి రోజునే వైకుంఠంలోని ఉత్తర ద్వారం నుంచి ముక్తిని ప్రసాదించాడని పురాణ గాథ. శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన 12 మంది ఆళ్వారులలో ఒకరైన పెరియాళ్వార్ శ్రీభూనీలా సమేతుడై గరుఢ వాహనంపై ఉన్న శ్రీమన్నారాయణుడి వైకుంఠ ఏకాదశి నాడు ఆకాశంలో ఉత్తరం వైపున దర్శించాడని చరిత్ర. ఈ కారణంగానే ఏకాదశి పర్వదినాన్ని మధ్య మణిపూసగా చేసుకొని ముందు పది రోజులు 'పగల్‌పత్తు' ఉత్సవాలు, వెనుక పది రోజులు 'రాపత్తు' ఉత్సవాలుగా నిర్వహిస్తారు. మొత్తం 21 రోజులపాటు ఎంతో వైభవంగా శ్రీ పాంచారాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయానికి రంగులు, చలువ పందిళ్లు, తెప్పోత్సవం నిర్వహించేందుకు హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. అలాగే, పట్టణానికి నాలుగు వైపులా స్వాగత ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రత్యేకంగా చిన్న చిన్న హంస చిత్రపటాలను స్వాగత ద్వారాలకు అమర్చుతున్నారు. ఈ నెల 13న పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య మత్స్యవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 14న కూర్మావతారం, 15న వరాహావతారం, 16న నారసింహా, 17న వామన, 18న పరుశురామ, 19న శ్రీరామావతారం, 20న బలరామావతారం, 21న శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిస్తారు. దీంతో పగల్‌పత్తు ఉత్సవాలు ముగుస్తాయి. 22న అంగరంగ వైభవంగా అలంకరించిన హంసవాహనంపై సీతారామ, లక్ష్మణమూర్తులు జలవిహారం చేయనున్నారు. 23న ఎంతో మంది భక్తులు ఎంతో ఆత్రతగా ఎదురు చూసే వైకుంఠ ద్వారా దర్శనం నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. అనంతరం 30న కల్కీ అవతారంతో రామయ్యకు భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 8న ఆలయం ప్రాంగణంలో సకల దేవతలను కొలువదీర్చి నేత్రపర్వంగా విశ్వరూప సేవ జరుపుతారు.



ఉత్తర ద్వార దర్శనం (ఫైల్)

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపించాయి


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

- పార్టీ అధినేత కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం
- బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు
- అదే నమ్మకంతో పనిచేస్తాం: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

భద్రాచలం, డిసెంబర్ 3: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపించాయని బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం ఆదివారం ఆయన తన కుటుంబ సమేతంగా భద్రాచలం చేరుకొని రామయ్యను దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు, నా గెలుపు కోసం శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. తనపై నమ్మకంతో తనకు టికెట్ ఇచ్చి ఆశీస్సులు అందించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఎన్నడూ పార్టీని వీడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అందరూ రేయింబవళ్లూ నిద్రాహారాలు మాని తన విజయం కోసం అవిరళ కృషి చేశారని అన్నారు. ఏ ఆశతో ప్రజలు తనను గెలిపించారో తాను వారి ఆశలను నేరవేరుస్తానని అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి ఆగిపోయిందని, ఇకపై ఆ అభివృద్ధిని కొనసాగిస్తానని అన్నారు. భద్రాచలంలో మిగిలి ఉన్న కరకట్ట నిర్మాణం, పోడు భూములకు పట్టాలు, త్రీఫేజ్ కరెంట్, సాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈసారి భద్రాచలం సీటు గెలవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారని అన్నారు. వారిచ్చిన స్ఫూర్తితో అహర్నిశలు శ్రమించామని, సమష్టి కృషితో విజయం సాధించామని అన్నారు.

### అదే నమ్మకంతో పనిచేస్తాం: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

అనంతరం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాత మధుసూదన్ మాట్లాడుతూ.. సౌమ్యుడైన డాక్టర్ తెల్లం వెంకట్రావును నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని అన్నారు. వారి నమ్మకాన్ని నిలుపుకుంటూ పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు గూడపాటి శ్రీనివాస్, ఎండీ నవాబ్, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, మామిడి పుల్లారావు, నక్కా ప్రసాద్, మల్లెల లోకేశ్, దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మహిళా నాయకులు గంగా భారతి, ఒగ్గు అనురాధ, కేతినేని లలిత, మానె కమల పాల్గొన్నారు.

# గౌతంపూర్‌లో కార్తీక దీపోత్సవం



చుంచుపల్లి, డిసెంబర్ 3 : మండలంలోని గౌతంపూర్‌లో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి పరవశించిపోయారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల గెలుపు

**బీఆర్ఎస్ అభ్యర్థిపై 49,381 ఓట్ల తేడాతో విజయం**

**మొదటి నుంచి అన్ని రౌండ్లలోనూ తుమ్మలకే ఆధిక్యం**

ఖమ్మం, డిసెంబర్ 3 : ఖమ్మం శాసనసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై గెలుపొందారు. ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 3,22,996 ఓట్లు ఉన్నాయి. వీటిలో పోస్టల్ బ్యాలెట్లు కలుపుకొని 2,36,224 ఓట్లు పోలయ్యాయి. వీటిలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌కు 86,635 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుకు 1,36,016 ఓట్లు వచ్చాయి. తుమ్మల నాగేశ్వరరావు 49,381 ఓట్లు మెజార్టీ సాధించారు. కాగా, నోటాకు 1925 ఓట్లు పడగా.. 44 ఓట్లను అధికారులు తిరస్కరించారు. మరో 2 ఓట్లను టెండర్ ఓట్లుగా నిర్ధారించారు. 49,381 ఓట్ల మెజార్టీతో తుమ్మల గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ఆదర్శ సురభి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీచైతన్య కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. 8:30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపును అధికారులు ప్రారంభించారు. మొత్తం 23 రౌండ్లలో అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఆధిక్యాన్ని ప్రదర్శించారు.

### రౌండ్ల వారీగా ఇలా..

| రౌండ్ | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | తుమ్మల ఆధిక్యం |
|---|---|---|---|
| 1 | 5537 | 5992 | 455 |
| 2 | 3005 | 4252 | 1247 |
| 3 | 5646 | 5678 | 32 |
| 4 | 4227 | 8163 | 3936 |
| 5 | 4327 | 7062 | 2735 |
| 6 | 4374 | 7025 | 2651 |
| 7 | 3197 | 6042 | 2845 |
| 8 | 3410 | 5722 | 2312 |
| 9 | 2790 | 5141 | 2351 |
| 10 | 2579 | 5428 | 2849 |
| 11 | 2556 | 5512 | 2956 |
| 12 | 3172 | 5533 | 2361 |
| 13 | 3932 | 5655 | 1723 |
| 14 | 3790 | 4869 | 1079 |
| 15 | 3977 | 5824 | 1847 |
| 16 | 4452 | 4898 | 446 |
| 17 | 4423 | 6732 | 2309 |
| 18 | 4282 | 5618 | 1336 |
| 19 | 4436 | 6231 | 1795 |
| 20 | 3564 | 5591 | 2027 |
| 21 | 3578 | 6034 | 2456 |
| 22 | 3410 | 5722 | 2312 |
| 23 | 553 | 1503 | 950 |
| పోస్టల్ | 729 | 4501 | 3772 |
| **మొత్తం** | **86,635** | **1,36,016** | **49,381** |